ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.35, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 65, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 45, పందిరి బీర 55, క్యాబేజీ 23, క్యారెట్ 55, దొండ 45, గుండుబీన్స్ 100, గింజ చిక్కుడు 100, గోకరకాయ 55, కీర 31, దోసకాయ 40, బీట్‌రూట్ 35, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 36, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 65, సొరకాయ 17, పొట్లకాయ 23, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

తలసానికి దీపావళి శుభాకాంక్షలు



తలసానికి శుభాకాంక్షలు తెలిపిన రాయల సేవా సమితి ప్రతినిధులు

అమీర్‌పేట: రాయల సేవాసమితి ప్రతినిధులు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆంజనేయులు, అప్పాజి, రాజశేఖర్, రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు కృషి

అమీర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడి ఉందని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. మంగళవారం అమీర్‌పేట్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ జన్వాడ ఫామ్ హౌజ్‌లో అనుమతి లేకుండా పార్టీ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సోదాలు చేశారన్నారు. దానికి రాజకీయ కోణాన్ని ఆపాదించి లబ్ధిపొందేందుకు బీఆర్‌ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.పైగా అది కుటుంబ పార్టీ అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పరీక్షల్లో ఓ వ్యక్తికి పాజిటివ్ వచ్చినా బురదజల్లేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీగా సిటీగా మార్చేందుకు అందరూ కలిసి రావాలన్నారు.గత పాలనలో డ్రగ్స్, రేవ్ పార్టీలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా ఉంటుందని హెచ్చరించారు.

వక్ఫ్ బోర్డు స్థలంపై అధికారుల సర్వే

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని వక్ఫ్‌బోర్డు స్థలంపై రెవెన్యూ, వక్ఫ్ బోర్డు అధికారులు మంగళవారం జాయింట్ సర్వే నిర్వహించారు. రెజిమెంటల్‌బజార్‌లోని సర్వే నంబర్ 21లో చాంద్‌బాయ్ దర్గాకు చెందిన వక్ఫ్‌బోర్డు స్థలం ఉంది. ఈ సర్వే నంబర్‌ను ఆనుకుని సర్వే నంబర్ 22 నుంచి 35 వరకు ప్రైవేటు వ్యక్తుల స్థలాలు ఉన్నాయి. ఈ సర్వే నంబర్లకు చెందిన ప్రైవేటు వ్యక్తులు వక్ఫ్ బోర్డు స్థలాన్ని కబ్జా చేసి షాపులు నిర్మించారని బోర్డు అధికారులు సికింద్రాబాద్ మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం సికింద్రాబాద్ మండల తహసీల్దార్ కిరణ్, చైన్‌మెన్ భాస్కర్, వక్ఫ్‌బోర్డు తహసీల్దార్ అసదుల్లాలు సర్వే నిర్వహించారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు వక్ఫ్ బోర్డు స్థలాన్ని ఆక్రమించినట్లు నివేదిక అందించారు.

పవర్‌గ్రిడ్‌లో వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న ఉద్యోగులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ కవాడిగూడ ప్రధాన రహదారిలోని పవర్‌గ్రిడ్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగులు వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్ అఖిలేష్ పాఠక్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికిముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్ కందా మాట్లాడుతూ ఉద్యోగులు అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలన్నారు. జాతి అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని సూచించారు. సంస్థ ప్రాంగణంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు ప్లేకార్డులను చేతబూని వాకథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వీసీకి అభినందనలు



ఓయూ వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కుమార్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వీసీని శాలువాతో సన్మానించి, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. యూనివర్సిటీ పాలన వ్యవహారాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి ఉన్నారు.

నేడు రుద్రహోమం

సనత్‌నగర్: ఆశ్వయుజ మాసం బహుళ త్రయోదశి తదుపరి చతుర్దశి (మాస శివరాత్రి) సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 7.30 గంటలకు రుద్రహోమం, సాయంత్రం 6.30 గంటలకు (ప్రదోషకాలం) సమయంలో అభిషేకం, ప్రత్యేక అలంకార దర్శనం ఉంటుందని ఆయన వివరించారు.

గోపాలపురం ట్రాఫిక్ పీఎస్‌లో ఓపెన్‌హౌజ్

రాంగోపాల్‌పేట్: పోలీసుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఉత్తర మండలం ఏసీపీ శంకర్‌రాజు ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ పోలీసులు వాడే వివిధ పరికరాలు, సిగ్నల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సతీష్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఏఎస్ఐ జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పని ఒకటే.. ప్రారంభాలు రెండు

- మరోమారు కొబ్బరికాయ కొడుతున్న ప్రజాప్రతినిధులు
- తలపట్టుకుంటున్న అధికారులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రారంభోత్సవాలు గందరగోళంగా మారుతున్నాయి. చిన్నపాటి రోడ్డు పనుల ప్రారంభోత్సవాలు సైతం వివాదాలకు కారణమవుతున్నాయి. సదరు అభివృద్ధి పనుల షెడ్యూల్ సమాచారాన్ని ముందే తెలుసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు కండువాలతో ప్రత్యక్షమై కొబ్బరికాయ కొట్టి ప్రారంభోత్సవాలు చేసి వెళ్లిపోతున్నారు. తాము ప్రారంభించాల్సిన అభివృద్ధి పనులు కాంగ్రెస్ నాయకులు ఎలా ప్రారంభిస్తారని కార్పొరేటర్లు అధికారులతో వాదనకు దిగుతున్నారు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే ప్రారంభించాల్సిన అభివృద్ధి పనులకు సైతం కాంగ్రెస్ నాయకులు ప్రారంభోత్సవాలు చేస్తుండడం గందరగోళ పరిస్థితులకు దారితీస్తుంది. అధికారిక కార్యక్రమాలు తమకు మాత్రమే చెప్పాలని కార్పొరేటర్లు, తమ పార్టీ అధికారంలో ఉన్నందున తమకూ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి చేస్తుండడంతో అధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

తరచూ వాగ్వాదాలు..

మెట్టుగూడ, సీతాఫల్‌మండి డివిజన్లలో పలుమార్లు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సమయంతోపాటు, బోనాల వేడుకల సహాయనిధి, సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ సమయాల్లోనూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులకు మధ్య గొడవలు జరిగి ఘర్షణ వాతావరణం నెలకొంది. ఏ అధికారంతో అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు ప్రారంభోత్సవాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం మాది. నిధులు మా ప్రభుత్వం నుంచి వస్తున్నాయి. ప్రారంభించుకునే అధికారం మాకు ఉంది అంటూ కాంగ్రెస్ నాయకులు చెబుతుండడం సర్వసాధారణంగా మారింది.

ప్రొటోకాల్ పాటించాలి..

అధికార పార్టీ ఏదైనా ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను గౌరవించాల్సిన బాధ్యత అన్ని పార్టీల నాయకులకు ఉండాలని జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, కార్పొరేట్లు ప్రజాప్రతినిధులుగా ఉన్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ చెప్పారు.

భాగస్వాములం అవుతున్నాం..

తమ పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో మాత్రమే తాము అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో భాగస్వాములం అవుతున్నామని కాంగ్రెస్ నాయకుడు జలంధర్‌రెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధుల ప్రారంభోత్సవాలను అడ్డుకుని తాము ఎక్కడా ప్రొటోకాల్ నిబంధనలు ఉల్లంఘించడం లేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కొబ్బరికాయలు కొట్టినట్టే తాము కూడా అభివృద్ధి పనుల వద్ద కొబ్బరికాయలు కొడుతున్నామని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు చేరవేడం కోసమే తాము ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములం అవుతున్నామన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు ప్రారంభోత్సవాలు



కాసర్ మసీదు వద్ద సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ



అదే రోడ్డు పనులను మరోమారు ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

ట్రాఫిక్ విధులపై విద్యార్థులకు అవగాహన



సనత్‌నగర్: మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ అన్నారు. సీపీ సీవీ ఆనంద్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం బేగంపేట టీటీఐ కార్యాలయంలో ఉద్భవ్, మమత హైస్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. పోలీసులు ఉపయోగించే బారికేడ్స్, టాబ్స్, రిఫ్లెక్షన్ జాకెట్స్, మాన్‌ప్యాక్ సెట్ తదితరాలపై వివరించారు. ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై ఏ విధంగా ట్రాఫిక్‌ను నియంత్రిస్తారో తెలియజేశారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు భద్రత, నియమాలను బోధనాంశాల్లో చేర్చాలన్నారు. రహదారులపై క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య, సిబ్బంది శ్రీకృష్ణ, హీరో మోటార్‌కార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ సూపర్‌వైజర్ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేషనల్ సైక్లింగ్ పోటీల్లో సత్తాచాటిన రత్నిక



క్యాష్ ప్రైజ్ అందుకుంటున్న రత్నిక

లాలాపేట: సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26,27 తేదీల్లో ఢిల్లీలో జరిగిన ఖేలో ఇండియా సైక్లింగ్ లీగ్ ట్రాక్ ఈవెంట్‌లో సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన రత్నిక తెలంగాణ తరపున ప్రాతినిథ్యం వహించి సత్తాచాటారు. జాతీయ స్థాయిలో జరిగిన ఉమెన్స్ లీగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించారు. దీంతో పాటుగా క్యాష్ ప్రైజ్‌ను అందుకున్నారు. సైక్లింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో తెలంగాణ నుంచి పాల్గొన్న మొదటి క్రీడాకారిణిగా రత్నిక నిలిచారు. ప్రస్తుతం ఆమె సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



అమీర్‌పేట: వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ అన్నారు. ప్రపంచ స్ట్రోక్ డే సందర్భంగా మంగళవారం అమీర్‌పేట మెడికేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె హెల్త్ ప్యాకేజీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయస్సు మీద పడ్డ వారు బీపీ, షుగర్‌ను అదుపులో పెట్టుకుని స్ట్రోక్ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్ట్రోక్ అనేది తెలియకుండానే వ్యక్తిని కుంగదీస్తుందని, ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 40 సెకన్లకు ఒకరు స్ట్రోక్ బారినపడుతున్నారని ఆసుపత్రి వైద్య నిపుణులు పేర్కొన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ అప్పటి వరకు పూర్తి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిని వికలాంగుడిగా మారుస్తుందన్నారు.దీనిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ రాజ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ అభిలాష్ ముసునూరి పాల్గొన్నారు.

సకాలంలో స్ట్రోక్ లక్షణాలు గుర్తించాలి..

సనత్‌నగర్: చాలామంది స్ట్రోక్ లక్షణాలను గుర్తించలేకపోవడం వల్ల చాలా ఆలస్యంగా ఆస్పత్రుల్లో చేరుతున్నారని, తద్వారా వారికి తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్ సీనియర్ న్యూరో ఫిజిషియన్లు డాక్టర్ సీహెచ్.గోపాల్, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ నివేదిత సాయిచంద్ర అన్నారు. వరల్డ్ స్ట్రోక్ డే దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బేగంపేటలోని కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్‌లో 'స్ట్రోక్ లక్షణాలు గుర్తించడం, సకాలంలో వైద్య సేవలు పొందడం ఎలా అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ నిర్ధారణ కంటే నివారణ ముఖ్యమన్నారు. వ్యాయామం, జీవన శైలిలో మార్పుల ద్వారా బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలను గుర్తిస్తే బీఫాస్ట్ అమలు చేయాలని సూచించారు. బీ–బ్యాలెన్స్ తప్పడం, ఈ–ఆకస్మిక దృష్టి లోపం, ఎఫ్–ముఖం ఒక వైపు వంగిపోవడం, ఏ–చేతులు బలహీన పడడం, ఎస్–మాట్లాడడంలో ఇబ్బంది, టీ–వెంటనే స్పందించడమని పేర్కొన్నారు. స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం చాలా ముఖ్యమైనదన్నారు. ప్రతి నిమిషానికి మెదడులో మిలియన్ల కొద్ది నరాలు దెబ్బతినడం, జ్ఞాపక శక్తిని కోల్పోయేలా చేస్తుందన్నారు.

కేన్సర్ లక్షణాలపై అవగాహన అవసరం

అడ్డగుట్ట: ప్రాథమిక దశలోనే కేన్సర్ వ్యాధిని గుర్తిస్తే చికిత్స సులభం అవుతుందని పలువురు వైద్యులు అన్నారు. జనహిత సేవా ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ వెస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సీ, డీ సెక్షన్ కమ్యూనిటీ హాల్‌లో ప్రభుత్వ ఎంఎన్‌జే హాస్పిటల్ సౌజన్యంతో కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు ముఖ్య అతిథులుగా హాజరైన కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి, రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ వెస్ట్ అధ్యక్షుడు చందన్‌కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ భవ్య, నిఖిత మాట్లాడుతూ వ్యాధి లక్షణాలపై మహిళలకు అవగాహన లేనందునే కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. ఎటువంటి భయం లేకుండా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 22 ఏళ్లు నిండిన మహిళలు ప్రతి మూడేళ్లకు ఒకసారి గర్భాశయ కేన్సర్(పాప్ స్మియర్) నిర్ధారణ పరీక్ష, 45 ఏళ్లు నిండి మహిళలు ఐదేళ్లకోసారి రొమ్ము కేన్సర్(మామ్మో గ్రాఫి) నిర్ధారణ పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకుని కేన్సర్ రాకుండా జాగ్రత్తపడాలని సూచించారు. పరీక్షల అనంతరం కేన్సర్ వ్యాధి లక్షణాలు ఉంటే రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే ప్రభుత్వ కేన్సర్ ఆస్పత్రిలో ఉచితంగా పరీక్షలు , చికిత్స లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ వెస్ట్ ప్రతినిధులు ప్రవీణ్ రావు, ప్రకాష్, దివాకర్, వసుందరి, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు ఎస్ఎన్. మూర్తి, వెంకట నారాయణ, నర్సింగ్‌రావు, ప్రసాద్, బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, సత్తయ్య, ఎల్లయ్య, దాసరి శ్రీను, రామప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌ను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐజీ రమేష్

రాంగోపాల్‌పేట్: బ్రెయిన్ స్ట్రోక్ లాంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటంతో పాటు అవగాహన చాలా ముఖ్యమని ఐజీ రమేష్ మస్కీపురం అన్నారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో బ్రెయిన్ స్ట్రోక్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్‌ను ఏ మాత్రం అలక్ష్యం చేసినా ప్రాణాలకే ప్రమాదమన్నారు. ముందస్తు పరీక్షల ద్వారా స్ట్రోక్ వచ్చే ప్రమాదాన్ని గుర్తించి నష్ట నివారణ చర్యలు తీసుకోవచ్చునన్నారు. యశోద గ్రూప్ డైరెక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ చికిత్సలో అందుబాటులోకి తీసుకుని వచ్చిన అత్యాధునిక చికిత్సావిధానమైన మెకానికల్ థ్రోంబెక్టమీతో చాలా మంది రోగులను వైకల్యం, ప్రాణాపాయం నుంచి కాపాడుతుందన్నారు. ఈ చికిత్స ద్వారా మెదడులోని రక్తనాలాల్లో గడ్డలను తొలగించేందుకు సహాయపడుతుందని తర్వాత రోగి మామూలు జీవితం గడుపవచ్చన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన 24గంటల వరకు ఈ చికిత్సను అందించవచ్చన్నారు. యశోద ఆస్పత్రిలో డెరెక్ట్ టూ యాంజియో సూట్‌తో బైప్లేస్ న్యూరో యాంజియో ప్రొసీజర్ సూట్ అనే అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ఎంతో మంది బ్రెయిన్ స్ట్రోక్ రోగులను కాపాడగలిగామన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యూరాలజిస్ట్ ఆర్ఎస్ కోమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



టీఆర్‌టీ కాలనీలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని, పనులు ముందుకు సాగడం లేదని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ అన్నారు. మంగళవారం జోషి కాంపౌండ్‌లో రూ. 33 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు, టీఆర్‌టీ కాలనీ పార్కులో రూ.7 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో సీతాఫల్‌మండిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల భవనాల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదన్నారు. విద్య, ఆరోగ్య పరమైన పనులకు సైతం నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల విషయమై కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరుపట్ల ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. డివిజన్ పరిధిలోని జోషి కాంపౌండ్, టీఆర్‌టీ ప్రాంతాల సమస్యల రహితంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కరాటే రాజు, జోషి కాంపౌండ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ సుందర్, ప్రధాన కార్యదర్శి సుభాష్, టీఆర్‌టీ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు జుగ్ను శేఖర్, రాజేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఎన్‌జీఓ మాజీ అధ్యక్షుడు మధుకర్ రాజ్‌కు వీడ్కోలు



మధుకర్ రాజ్ దంపతులను సన్మానిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఎన్‌జీఓస్ అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పని చేసిన మధుకర్ రాజ్‌కు ఉద్యోగులు వీడ్కోలు పలికారు. ఎన్‌జీఓస్ అధ్యక్షుడు బి.జ్ఞానేశ్వర్ అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధుకర్ రాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఆర్ట్స్ కాలేజీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ (ఏఆర్)గా పని చేస్తున్న ఆయన ఎన్‌జీఓస్ ప్రధాన కార్యదర్శిగా రెండు సార్లు, అధ్యక్షుడిగా ఒక సారి జాయింట్ సెక్రెటరీగా ఒకసారి ఎన్నికయ్యారు. టీఎన్‌జీఓస్ నాయకులతో పాటు ఓయూ వీసీ ప్రొ.కుమార్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, మహాత్మాగాంధీ మాజీ వీసీ ప్రొ.గోపాల్ రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు కేఎస్ నాగరాజరావు, ఎ.అవినాష్, ఎ.రవి, శంకరయ్య, భీమయ్య, అశోక్‌కుమార్, భూమరావు, యూసుఫ్, పాషా, టీజీఈ జేఏసీ ఛైర్మన్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముజీబ్ హుస్సేన్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

తెలంగాణ సేవా స్థంభ్ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి మహేశ్

లాలాపేట: ఆల్ ఇండియా సేవా స్థంభ్ తెలంగాణ రాష్ట్ర సదస్సు మంగళవారం లాలాపేటలోని వినోబానగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం జరిగింది. తెలంగాణ సేవా స్థంభ్ కన్వీనర్ బండి మహేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా సేవా స్థంభ్ నేషనల్ ప్రెసిడెంట్ కే. నాగేశ్వర్‌రావు, సేవా స్థంభ్ సెంట్రల్ ఫైనాన్స్ సెక్రటరీ ఎం ఎస్ మీనా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు అండగా ఉంటూ వారి హక్కుల పరిరక్షణకు సేవా స్థంభ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణలోని 16 జిల్లాల నుంచి హాజరైన జిల్లా అధ్యక్షులు తెలంగాణ సేవా స్థంభ్ అధ్యక్షుడిగా బండి మహేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జీవి రత్నాకర్, నాయకులు యాదగిరి, నారాయణ, వెంకట్, శేఖర్, శివశంకర్, వివేక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణ యజమానులు నిబంధనలు పాటించాలి

సనత్‌నగర్: బాణాసంచా దుకాణ యజమానులు నిబంధనలు పాటించాలని అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్ఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌లో బాణాసంచా దుకాణదారులతో ఆయన సమావేశమై పలు సూచనలు జారీ చేశారు. దుకాణాల వద్ద అగ్ని నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా దుకాణాలను ఐరన్ షీట్లతో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాటర్ డ్రమ్ములు, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బాల కార్మికులను దుకాణాల్లో పని చేయించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సనత్‌నగర్ ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్‌లో చేరిక

సికింద్రాబాద్: ట్రాక్‌మెన్ అసోసియేషన్ నాయకులు పలువురు మంగళవారం దక్షిణమధ్యరైల్వే మజ్దూర్ యూనియన్‌లో చేరారు. వారిలో ట్రాక్ మెన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామ్మూర్తి, జనరల్ సెక్రెటరీ ప్రభాకర్, నాయకుడు సురేష్‌తోపాటు పలువురు ట్రాక్‌మెన్లు ఉన్నారు. సికింద్రాబాద్ డివిజన్ యూనియన్ కార్యదర్శి రవీందర్ ఆధ్వర్యంలో మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రాక్‌మెన్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం మజ్దూర్ యూనియన్ కట్టుబడి ఉందన్నారు. మజ్దూర్ యూనియన్‌లో ఇంజినీరింగ్ కార్మికులకు పెద్ద పీట వేయడమే కాకుండా ఒక ట్రాక్‌మెన్‌ను రైల్వే క్రెడిట్ కో ఆపరేటివ్ అధ్యక్షుడిగా నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మజ్దూర్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్ రావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులను క్యాజువల్ లేబర్ నుంచి పర్మనెంట్ చేయించడం కోసం ప్రమోషన్ చానల్ ఏర్పాటు చేశామన్నారు. ఇంజినీరింగ్ మ్యాన్యువల్ మార్చడంతోపాటు, కీమెన్ వర్క్ లోడ్ తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధర్, నాయకులు బచ్చలి శ్రీనివాస్, ఏలుపుల సాంబరాజు, మొండయ్య, ప్రవీణ్, అశోక్, రైల్వే క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ చిలుకు స్వామి, కోశాధికారి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.